# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 149 వ భాగం

## పరీక్షిత్తు - 1

మహాభారత యుద్ధం చివరిలో అశ్వత్థామ బ్రహ్మ శిరోనామకాస్త్రం వేసి ‘అపాండవం అగు గాక’ అన్నాడు. దీనికి అర్థం చెప్పుకోవాలంటే, మొత్తం కౌరవులు అందరూ పోయినట్టే పాండవులు కూడా ఎవరూ మిగలకుండా నాశనం అవ్వాలని. అయితే అక్కడే ఉన్న కృష్ణుడు చెప్తాడు, నువ్వు వీళ్ళని ఏమీ చేయలేవు కానీ నీ అస్త్రం దారిని మరో చోటకి మళ్ళించుకో అని. అయితే ఈ అస్త్రం ఉత్తర గర్భంలో ఉన్న పిల్లాడిని చంపుతుంది అని మళ్ళిస్తాడు దాన్ని అశ్వత్థామ. కృష్ణుడితో చెలగాటమా? నేను వాణ్ణి బతికించి తీరుస్తాను అని చెప్తాడు అప్పుడు నల్లనయ్య. ఈ కధ తర్వాత ఏమైంది అనేది కుతూహలంగా సూతుణ్ణి అడుగుతున్నారు శౌనకాది మునులు. ఇది భాగవతం మొదటి స్కంధంలో చెప్తున్నాడు పోతన. సక్రోధం అంటే అప్పటికప్పుడు ఒక్కసారిగా వచ్చినది. అంతటి బ్రహ్మాస్త్రాన్ని తట్టుకుని కుర్రాడు ఎలా బతికాడు?

సీ. గురునందనుండు సక్రోధుఁడై యేసిన
బ్రహ్మశిరోనామబాణవహ్ని
గంపించు నుత్తరగర్భంబు గ్రమ్మఁగఁ
బద్మలోచనుచేతఁ బ్రతికె నండ్రు;
గర్భస్థుఁ డగు బాలుఁ గంసారి యే రీతి
బ్రతికించె? మృత్యువు భయము వాపి
జనియించి యతఁడెన్ని సంవత్సరములుండె?
నెబ్భంగి వర్తించె? నేమిసేసె? [1-277]

ఆ. వినుము, శుకుఁడు వచ్చి విజ్ఞానపద్ధతి
నతని కెట్లు సూపె నతఁడు పిదపఁ
దన శరీర మే విధంబున వర్జించె
విప్రముఖ్య! నాకు విస్తరింపు. [1-277.1]

ఉత్తర గర్భం ఈ అస్త్రంతో కంపిస్తూ ఉంది అయినా పద్మలోచనుడు (కృష్ణుడు) బతికించాడు అంటారు. ఆ కుర్రాడికి మృత్యు భయం పోగొట్టి ఎలా బతికించాడు? పుట్టిన కుర్రాడు ఎంతకాలం బతికాడు, ఎలా ప్రవర్తించాడు ఏమేమి పనులు చేసాడు? ఆ తర్వాత శుకమహర్షి వచ్చి విజ్ఞానానికి దారి ఎలా చూపించాడు ఈయనకి? ఇవన్నీ మాకు విశదంగా చెప్పు అంటున్నారు. ఈ సీస పద్యంలో కృష్ణుణ్ణి పోతన ఎమన్నాడో గమనించారా? పద్మలోచనుడు అనేది అర్థం అవడం సులభం. "కంసారి" అంటే? కంసుడికి అరి లేదా శతృవు.

వ. అనిన సూతుం డిట్లనియె;ధర్మనందనుండు చతుస్సముద్ర ముద్రి తాఖిల జంబూద్వీప రాజ్యంబు నార్జించియు; మిన్నుముట్టిన కీర్తి నుపార్జించియు; నంగనా, తురంగ, మాతంగ, సుభట, కాంచ నాది దివ్యసంపదలు సంపాదించియు; వీరసోదర, విప్ర, విద్వజ్జన వినోదంబులఁ బ్రమోదించియు, వైభవంబు లలవరించియుఁ; గ్రతువు లాచరించియు; దుష్టశిక్షణ శిష్టరక్షణంబు లొనరించియు; ముకుందచరణారవింద సేవారతుండై సమస్త సంగంబు లందు నభిలాషంబు వర్జించి యరిషడ్వర్గంబు జయించి రాజ్యంబు సేయుచు. [1-278]

తే. చందనాదుల నాఁకట స్రగ్గువాఁడు
దనివి నొందని కైవడి ధర్మసుతుఁడు
సంపదలు పెక్కుఁ గలిగియుఁ జక్రిపాద
సేవనంబులఁ బరిపూర్తి సెందకుండె. [1-279]

ధర్మనందనుడు (యుధిష్టిరుడు) చతుస్సాగర పర్యంతం ఉన్న జంబూద్వీపాన్ని పాలిస్తూ దివ్యమైన సంపదలు ఆర్జించి రాజ్యం చేయడం మొదలుపెట్టాడు. ఈ సంపదలు అంగన (స్త్రీలు), తురంగ (గుర్రాలు), మాతంగ (ఏనుగులు), సుభట (యోధులు), కాంచనం (బంగారం) అనేవి. ఇన్ని సంపాదించినా చక్రి పాద సేవనం వదలకుండా ఉన్నాడు. అంటే తనకి ఇవన్నీ వచ్చేలా చేసిన కృష్ణుణ్ణి మర్చిపోలేదు.

వ. అంతం గొన్ని దినంబులకు నభిమన్యుకాంతాగర్భంబు నందున్నడింభకుండు దశమమాసపరిచ్ఛేద్యుండై గర్భాంతరాళంబున దురంతంబైన యశ్వత్థామ బాణానలంబున దందహ్యమానుండై తల్లడిల్లుచు. [1-280]

ఉ. కుయ్యిడ శక్తి లే దుదరగోళములోపల నున్నవాఁడ ది
క్కెయ్యది దా ననాథ నని యెప్పుడుఁ దల్లి గణింప విందు నే
డియ్యిషువహ్ని వాయుటకు నెయ్యది మార్గము నన్నుఁ గావ నే
యయ్య గలండు? గర్భజనితాపద నెవ్వఁ డెఱుంగు దైవమా! [1-281]

కొన్నాళ్ళకి అభిమన్యుడి భార్య (ఉత్తర) గర్భంలో ఉన్న పిల్లవాడు (డింభకుడు), పదినెలలు గడిచేసరికి అశ్వత్థామ విడిచిన బాణాగ్ని వల్ల – అగ్నిలో మండుతున్నట్టూ తల్లడిల్లడం మొదలుపెట్టాడు. కుర్రాడు ఏమనుకుంటున్నాడో చూడండి. ఇలా కడుపులో ఉన్నవాడిని, అనాథని, ఈ వేడి తగ్గడానికి దారి తెలియడం లేదు (వహ్ని వాయుటకు నెయ్యది మార్గము), నన్ను రక్షించడానికి ఏ అయ్య ఉన్నాడు? ఈ గర్భంలో నాకు కలగబోయే ప్రమాదం ఎవరికి తెలుస్తుందో దేవుడా?

క. చిచ్చఱకోలవశంబునఁ
జచ్చి బహిర్గతుఁడఁ గాని సమయమునను దా
నుచ్చలిత గర్భవేదనఁ
జచ్చును మా తల్లి ఘోర సంతాపమునన్. [1-282]

ఈ బాణాలవల్ల నేను ఇక్కడే గర్భంలో చచ్చిపోతే, బయటకి వచ్చిన జీవంలేని నన్ను చూసి, మా తల్లి కూడా సంతాపంతో చచ్చిపోవడం తథ్యం. గర్భస్థ శిశువుకి ఇవన్నీ తెలుస్తాయి బయటకి వచ్చేవరకూ అనేది శాస్త్రీయంగా కూడ నిరూపించబడిన సత్యం. అయితే ఒకసారి బయట పడగానే మాయ వల్ల అన్నీ మర్చిపోతారుట.

క. చెచ్చెర బాణజ్వాలలు
వచ్చిన విష్ణుండు గావవచ్చు ననుచుఁ దా
ముచ్చటలు సెప్పు సతులకు
నిచ్చలు మాయవ్వ నేఁడు నిజమయ్యెడినో. [1-283]

ఉత్తరగర్భంలో ఉన్న శిశువుని నేను తప్పక రక్షిస్తాను అని చెప్పాడు కృష్ణుడు. అది ఉత్తర అందరితో చెప్పడం ఈ కుర్రాడు విన్నాడు. ఈ దారుణమైన బాణాలు నన్ను కబళించడానికి వచ్చినప్పుడు నన్ను రక్షించడానికి (కావవచ్చుననుచు) విష్ణువు వస్తాడని మా అమ్మ (మాయవ్వ) అందరితో చెప్తూ ఉంటుంది కదా, అది ఇప్పుడు నిజం అవుతుందా? ఇంతవరకూ వచ్చాక అసలు ఈ భగవంతుడనేవాడు ఉన్నాడా అనే శంక కూడా.

శా. రాఁడా చూడ సమస్తభూతములలో రాజిల్లు వాఁ డిచ్చటన్
లేఁడా? పాఱుని చిచ్చుఱమ్ముఁ దొలఁగన్ లీలాగతిం ద్రోచి నా
కీఁడా? నేఁ డభయప్రదాన మతఁ డూహింపన్ నతత్రాత ముం
గాఁడా? యెందఱిఁ గావఁ డీ యెడల మత్కర్మంబు దా నెట్టిదో? [1-284]

చూడబోతే అన్ని భూతాల్లో ఉండే వాడిక్కడకి రాడా? లేడా? బ్రాహ్మణుడి (పాఱుని) బాణం (చిచ్చుఱమ్ము) తీసేయడానికి వచ్చి నాకు అభయం ఇవ్వడా? తనని మొక్కిన వారికి (త్రాత-రక్షించువాడు), ఇంతకు ముందు కూడా ఎంతమందికి అలా అభయం ఇచ్చి కాపాడాడు కాదు? అయినా నా (మత్) కర్మ ఎలా ఉందో కదా? ఇటువంటి ప్రార్ధనే తాను చేయవల్సిందాల్లా చేసి ఇంక వేరే ఏమీ చేయలేక – నీవే తప్ప ఇతః పరంబెరుగన్ అనే శరణాగతి – మనకి గజేంద్ర మోక్షం లో కనిపిస్తుంది, 'కలడందురు దీనులయెడ.... కలదు కలండనెడువాడు కలడో లేడో' [8-86] పద్యంలో. ఈ విధంగా శిశువు విచారించే సమయంలో వచ్చాడు భగవంతుడు. ఆ వచ్చినవాడు ఎలా ఉన్నాడు?

సీ. మేఘంబుమీఁది క్రొమ్మెఱుఁగుకైవడి మేని-
పై నున్న పచ్చని పటమువాఁడు;
గండభాగంబులఁ గాంచన మణి మయ-
మకరకుండలకాంతి మలయువాఁడు;
శరవహ్ని నడఁగించు సంరంభమునఁ జేసి-
కన్నుల నునుఁ గెంపు కలుగువాఁడు;
బాలార్కమండల ప్రతిమాన రత్న హా-
టక విరాజిత కిరీటంబువాఁడు; [1-286]

తే. కంకణాంగద వనమాలికా విరాజ
మానుఁ డసమానుఁ డంగుష్ఠమాత్రదేహుఁ
డొక్క గదఁ జేతఁ దాల్చి నేత్రోత్సవముగ
విష్ణుఁ డావిర్భవించె నవ్వేళ యందు. [1-286.1]

భాగవతం మొత్తంలో ఎక్కడ చూసినా పోతన విష్ణువుని ఇదే వర్ణన చేయడం గమనించవచ్చు - కిరీట, మకరకుండల, కేయూర హార కటక కంకణ మణిమేఖలాంబర వనమాలికా విరాజితుండు. మేఘం మీద మెరుపుతీగలా, నల్లని దేహం మీద పచ్చని బట్టలు ధరించి బాణాగ్నిని అడ్డుకోవడానికి (శరవహ్ని నడఁగించు సంరంభమున) అంగుష్టమాత్రుడై (బొటనవేలు అంత) గద చేతితో పట్టుకుని విష్ణువు కనిపించాడు శిశువుకి.

వ. ఇట్లు భక్తపరాధీనుం డయిన పరమేశ్వరుం డావిర్భవించి మంచు విరియించు మార్తాండు చందంబున శిశువునకు దశదిశలం దనచేతి యఖండిత మహోల్కాసన్నిభంబైన గదాదండంబు మండలాకారంబుగ జిఱజిఱం ద్రిప్పి విప్రుని చిచ్చఱమ్ము వేఁడిమి పోఁడిమిఁజెఱచి డింభకుని పరితాపవిజృంభణంబు నివారించి గర్భంబు గందకుండ నర్భకునికి నానందంబు గల్పించిన. [1-287]

ఇలా ఉదయించిన భక్త పరాధీనుడైన పరమేశ్వరుడు, మంచుని కరగగొట్టే సూర్యుడిలా, మహత్తైన ఉల్కలాగా అడ్డుకోగల తన గదని శిశువు చుట్టూరా దశదిశల్లో తిప్పి బాణాగ్నిని నివారించి గర్భం విచ్ఛిత్తి కాకుండా శిశువుకి ఆనందం కల్పించాడు. ఈ పరీక్షిత్తు పుట్టుక కథ అసలు భారతంలో మరో విధంగా కూడా చూడవచ్చు. పుట్టిన శిశువు ఏడవడంలేదనీ, వాడిలో ప్రాణం లేదనీ అందరూ ఏడుస్తున్నప్పుడు కృష్ణుడు వచ్చి తన పాదంతో తాకి వాణ్ణి బతికించాడని వేరుగా ఉంటుంది. కథ ఎటువంటిదైనా పరీక్షిత్తు మాత్రం కృష్ణుడి కృప వల్లే బతికి బట్టకట్టాడనేది నిజం.

మ. గదఁ జేఁబట్టి పరిభ్రమించుచు గదాఘాతంబులం దుర్జయ
ప్రదమై వచ్చు శరాగ్నిఁ దుత్తుమురుగా భంజించి రక్షించు నీ
సదయుం డెవ్వఁడొకో? యటంచు మదిలోఁ జర్చించుచున్ శాబకుం
డెదురై చూడ నదృశ్యుఁ డయ్యె హరి సర్వేశుండు విప్రోత్తమా! [1-288]

గద పట్టుకుని వచ్చి, నా చుట్టూ తిరుగుతూ నన్ను నాశనం చేయబోయే బాణాగ్నిని చెల్లాచెదురుగా పోగొట్టి రక్షించిన మహామహుడు ఎవరో అని మనస్సులో శిశువు అనుకుంటూండగానే సర్వేశ్వరుడైన హరి మాయం అయిపోయాడు. ఇదే మాయ కమ్మడం అంటే. పుట్టిన తర్వాత తనకి ఏమైందో తెలియదు.

వ. అంత ననుకూల శుభగ్రహోదయంబును, సర్వగుణోత్తర ఫలసూచకంబును నైన శుభలగ్నంబునం బాండవ వంశోద్ధారకుం డయిన కుమారుండు జన్మించిన ధర్మనందనుండు ధౌమ్యాది భూసురవర్గంబు రప్పించి, పుణ్యాహంబు సదివించి జాతకర్మంబులు సేయించి కుమారు జన్మమహోత్సవ కాలంబున భూసురులకు విభవాభిరామంబు లయిన గో భూ హిరణ్య హయానేక గ్రామంబులును స్వాదురుచిసంపన్నంబు లయిన యన్నంబు లిడిన వారలు తృప్తులై ధర్మపుత్రున కిట్లనిరి. [1-289]

ధర్మరాజు శుభలగ్నం చూసుకుని వంశోద్ధారకుడిగా పుట్టిన ఈ కుర్రాడికి జాతక కర్మలు చేయించాడు. వీడి జాతకం ఎలా ఉంటుంది, తమ కులం, రాజ్యం ఎలా ఉండబోతుందీ అనేవీ అడిగాడు బ్రాహ్మణులని. ఈ బ్రాహ్మణుల్లో పాండవుల పురోహితుడు ధౌమ్యుడు కూడా ఉండడం చూడవచ్చు. వాళ్ళేం చెప్తారో వచ్చే వ్యాసంలో. .

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS